

స్టాప్‌లాక్ గేటు రెండడుగులు పైకి..

- రైతులు ఆందోళన చెందొద్దు..
- ఆయకట్టులో ప్రతి ఎకరాకూ నీరు : ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, డిసెంబరు 29: గత మూడు వారాల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము మరమ్మతులకు గురైంది. ఈ క్రమంలో ఆదివారం స్టాప్‌లాక్ గేటును మెగా ఇంజనీరింగ్ కంపెనీ నిపుణులు రెండు అడుగులు పైకి లేపారు. గేటును పూర్తిగా పైకి లేపి బయటకు తీసి బాగు చేస్తామని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాళ్లపాడు వద్దకు చేరుకుని గేటు పనులను పరిశీలించారు. గేటును పైకి లేపిన ఇంజనీర్లను అభినందించారు. అలాగే మిగిలిన గేట్లకు కూడా త్వరితగతిన బాగు చేయాలని వారికి సూచించారు.

ప్రతి ఎకరాకూ నీరు

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సాగునీటి కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయకట్టు పరిధిలో సాగు చేసిన ప్రతి ఎకరాకూ నీరిస్తామని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా ప్రాజెక్టును సందర్శించి గేటు మరమ్మతులను పరిశీలించారు. ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మితో కూడా ఆయన గేటు పనులపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు, ఏఈ చంద్రమౌళి, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, అడపా రంగయ్య, జంపాల శివప్రసాద్, తాళ్లూరి మునలయ్య, గాలంకి ప్రసాద్, బొల్లినేని రమణయ్య, సీహెచ్ బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద గేటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గేటు ఎత్తి నీరు విడుదల

అయితే శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ప్రాజెక్టులోని నీరు 21 అడుగులకు చేరగా, 1000 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నది.దీంతో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చందంమ్రౌళి, సిబ్బంది కొత్త స్పిల్‌వేలోని మూడో గేటును అరడుగు ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేశారు.అయితే ఇన్‌ఫ్లో తగ్గడంతో ఆదివారం తెల్లవారుజాము మళ్లీ గేటును దించి వేశారు. సాయంత్రం 5 గంటల సమయంలో నీటిమట్టం 21 అడుగులకు చేరింది.అయితే ఇన్‌ఫ్లో లేదని అధికారులు తెలిపారు.

3,4 తేదీల్లో ఎస్సీ వర్గీకరణ కమిషన్ పర్యటన : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ జనవరి 3, 4 తేదీలలో జిల్లాలో పర్యటిస్తుందని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరుకు చేరుకుని బస చేస్తారని తెలిపారు. 4వ తేదీ ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశమవుతారని తెలిపారు. అనంతరం రాజీవ్ రంజన్ మిశ్రా వ్యక్తుల నుంచి, సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. తరువాత స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని, ఆరోజు రాత్రి ఇక్కడే బసచేసి 5వ తేదీ ఉదయం ఒంగోలుకు బయలుదేరి వెళతారని తెలిపారు.

పండుతున్న పాపాలు

అందుకలదు.. ఇందులేదన్న.. సందేహము వలదు.. ఎందెందు చూసినా అందందె కనిపించెను అవినీతి.. అన్నట్లుగా తయారయ్యాయి గత ప్రభుత్వంలోని పరిస్థితులు. ఏ పథకంపై విచారణ జరిపినా అందులోని అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఆఖరుకి పేదల ఇళ్ల మాటున నాడు జరిగిన దోపిడీకి అంతూపొంతూ లేదు. లేఅవుట్లకు స్థలాల కొనుగోలు దగ్గర నుంచి వాటిని చదును చేసే వరకూ రూ.వందల కోట్ల ప్రజాధనం స్వాహా జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క లేఅవుట్ల చదును మాటునే ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.50 కోట్లకు పైగా దోపిడీ జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికి చెల్లించిందే ఎక్కువనుకుంటుంటే ఇంకా బిల్లులు చెల్లించాలంటూ కొందరు కోర్టును ఆశ్రయిస్తుండడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించింది. డ్వామా ద్వారా బిల్లుల చెల్లింపు జరిగిన అన్ని లేఅవుట్లను పరిశీలించి వాస్తవికతను నిర్ధారించేందుకు జిల్లాలో కలెక్టర్ ఓ ఆనంద్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. ఈ విచారణ పూర్తయితే అక్రమాల బాగోతం వెలుగులోకి రానుంది. కాగా ఇప్పటికే అక్రమార్కుల్లో వణుకు పుడుతోంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

- జగనన్న లేఅవుట్లలో దోపిడీపై నేటి నుంచి విచారణ
- ప్రత్యేకంగా నాలుగు బృందాల ఏర్పాటు
- పేదల ఇళ్ల మాటున గత ప్రభుత్వంలో అక్రమాలు
- స్థలం చదును పేరుతో భారీగా నిధుల స్వాహా
- ఇప్పటికే రూ.60 కోట్లు చెల్లింపు
- ఇంకా రూ.33 కోట్లు పెండింగ్


కలువాయి మండలం మాదన్నగారిపల్లెలో వేసిన లేఅవుట్

వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతీ గ్రామంలోనూ భూమిని సేకరించారు. ఆ భూమిని అక్కడి పరిస్థితులకు అనుగుణంగా చదును చేశారు. కొన్ని చోట్ల చదును అవసరం లేకపోయినా తూతూమం త్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్నారు. చదును అవసరమైన చోట కూడా చేసిన పనికి, రికార్డు చేసిన బిల్లుకు చాలా వ్యత్యాసం ఉంటోంది. ఇటువంటి అవకతవకలు గతంలోనే వెలుగులోకి వచ్చాయి. అయినా నాడు పట్టించు కోలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు రెండు వేల లేఅవట్లను వేశారు. అందులో ప్రస్తుత జిల్లా పరిధిలో డ్వామా నుంచి 1170 లేఅవుట్లకు రూ.59.85 కోట్లను బిల్లులు కింద ఇప్పటికే చెల్లింపులు చేశారు. ఎంబుక్‌ల ప్రకారం ఇంకా రూ.33 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు చేయించుకున్న వైసీపీ నేతలు ఇప్పుడు కోర్టును ఆశ్రయిస్తున్నారు.

నాలుగు బృందాలతో విచారణ

లేఅవుట్ల చదును పేరుతో జరిగిన అవినీతిని బయటకు తీసేందుకు ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, అందుకు జిల్లాలో నాలుగు విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌తోపాటు ఈసీలు, టీఏలు ఈ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. సోమవారం నుంచీ ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. విచారణ ఏవిధంగా చేయాలన్నదానిపై ఉన్నతస్థాయి నుంచి విధివిధానాలు కూడా అందాయి. లేఅవుట్లో నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా..? ఎంబుక్‌లో రికార్డు మేరకు అక్కడ పని జరిగిందా..? ఈ గ్రావెల్‌ను అప్రూవల్ క్వారీ నుంచి తీసుకొచ్చారా.. లేక ప్రభుత్వ భూముల నుంచే తీసుకొచ్చారా..? బిల్లులు చెల్లింపు నిబంధనల ప్రకారం జరిగిందా.. లేదా..? విత్‌హెల్డ్ మొత్తం ఎంత ఉంచారు..? ఎంత చెల్లించేశారు..? అన్నది విచారణలో పరిశీలన చేస్తారు. వీలైనంత త్వరగా ఈ విచారణ పూర్తి చేసి నివేదిక అందజేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి విచారణ బృందాలకు ఆదేశాలు అందాయి.

నేటి నుంచి విచారణ

పేదలందరికీ ఇళ్ల పథకంలో జరిగిన లేఅవుట్ల చదునుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాలో క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ సిబ్బందితో నాలుగు విచారణ బృందాలను ఏర్పాటు చేశాం. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ చేపడతాయి. విచారణ పూర్తయ్యాక ఆ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తాం.

- గంగాభవాని, డ్వామా పీడీ

భారీ దోపిడీ

లేఅవుట్ల చదునుకుగానూ క్యూబిక్ మీటర్ గ్రావెల్‌కు రూ.135 చెల్లించేలా నిర్ణయించారు. అప్రూవల్ క్వారీ నుంచి తీసుకువచ్చిన గ్రావెల్‌కే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా తహసీల్దార్ల అనుమతితో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్‌ను తీసుకెళితే రూ.50 తగ్గించి క్యూబిక్ మీటర్‌కు రూ.85 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో మెజారిటీ లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే గ్రావెల్‌ను తరలించారు. కానీ బిల్లుల దగ్గరికి వచ్చే సరికి రూ.135 చొప్పున చెల్లించారు. అలానే విత్‌హెల్డ్ మొత్తం 25 శాతం ఉంచాలని ప్రభుత్వం ఆదేశిస్తే చాలామందికి 10 శాతం మాత్రమే ఉంచి మిగిలిన 15 శాతం మొత్తాన్ని చెల్లించేశారు. ఇలా ఇప్పటికి సుమారు రూ.60 కోట్ల వరకూ బిల్లులు చెల్లించారు. అయితే క్షేత్రస్థాయి విచారణ జరిపితే ఇప్పటికి చెల్లించిన మొత్తమే చాలా ఎక్కువగా ఉంటుందని డ్వామా వర్గాలు చెబుతున్నాయి.

2024 వెలుగు నీడలు
ఏడాదిలో ముగ్గురు ఎస్పీలు




ప్రథమార్థంలో ఆగని నేరాలు

ద్వితీయార్థంలో కట్టడికి యత్నాలు

- ఎన్నికల్లో చెమటోడ్చిన పోలీసులు
- కూటమి ప్రభుత్వంలో వినూత్న మార్పులు
- నేరాల కట్టడికి విస్తృత ప్రచారం

ఈ ఏడాది ప్రథమార్థంలో జిల్లాలో ఎన్నో నేరాలు, ఘోరాలు జరిగాయి. ద్వితీయార్థంలో వాటి కట్టడికి పోలీసులు వినూత్న ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయినా అనుకున్నంతగా అదుపులోకి రాలేదు. ముఖ్యంగా ఎన్నికల సంవత్సరం కావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఎన్నో పరిణామాలకు దారి తీసింది. గత ప్రభుత్వంలో విధులు నిర్వహించిన పోలీసు అధికారులే ఈ ప్రభుత్వంలోనూ స్టేషన్లు మారి విధులు నిర్వహిస్తున్నారు. దీంతో లాఅండ్‌ఆర్డర్‌లో ఎలాంటి మార్పులేదు. వైసీపీ ప్రభుత్వంలో నాయకులకు అండగా నిలిచిన పోలీసు అధికారులు ఈ ప్రభుత్వంలోనూ అధికార పార్టీ నేతలకు, ప్రతిపక్ష నాయకులకు బ్యాలెన్స్‌గా పనులు చేస్తూ సామాన్యులకు అన్యాయం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నెల్లూరు (క్రైం,ఆంధ్రజ్యోతి)

ఎస్పీల మార్పు

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ముగ్గురు ఎస్పీలను జిల్లా ప్రజలు చూశారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వంలో ఎస్పీగా ఉన్న తిరుమలేశ్వరరెడ్డి పలు ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆయన్ను జిల్లా నుంచి బదిలీ చేసింది. అనంతరం ఎస్పీగా ఆరీఫ్ హఫీజ్ వచ్చారు. ఆయన ఎన్నికలను సమర్థవంతంగా నిర్వ ర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత జూలైలో ఎస్పీగా జీ కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టారు.


తిరుమలేశ్వర్‌రెడ్డి
ఆరీఫ్ హఫీజ్
కృష్ణకాంత్

రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిం చారు. ప్రతీనెలా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, ఆర్టీవో, రెవెన్యూ, హైవే అధికారులను కలుపుకొని సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను కలెక్టర్ తెలుసుకోవడంతోపాటు అక్కడ ఎందుకు జరిగాయని, ఆ పరిస్థితులు ఏమిటన్న దానిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. హైవేలపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను నెలకోసారి గుర్తిస్తున్నారు. ఆ వివరాలను హైవే అధికారులకు అందించి, అక్కడ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తున్నారు. దీంతో గతంతో పోల్చుకుంటే జిల్లాలో ప్రమాదాల సంఖ్య కాస్త తగ్గింది.

నెల్లూరు నగరంలో హెల్మెట్ల వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)



హెల్మెట్ల వాడకంపై అవగాహన

హెల్మెట్ల వాడకం విషయంలో పోలీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో వాటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోకి వచ్చే ప్రతీ పోలీసు అధికారి, సిబ్బంది హెల్మెట్లు ధరించి లోపలికి వచ్చేలా నిబంధనలు తీసుకువచ్చారు. దీనికి తోడు హెల్మెట్ల వాడకంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నేరాల కట్టడికి విస్తృత ప్రచారం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నేరాల కట్టడిపై పోలీసు శాఖ విస్తృత ప్రచారం చేస్తోంది. విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో స్థానిక సీఐలు అవగాహన కల్పించడంతోపాటు కరపత్రాలను ముద్రించి అపార్ట్‌మెంట్లతోపాటు ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. సైబర్‌క్రైంలపై కూడా జిల్లా ఎస్పీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించాలంటూ ఆటోల్లో మైక్‌లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు.

మెట్టలోనూ హత్య, చోరీలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉదయగిరి ప్రాంతాన్ని విషా దంలో నింపిదనే చెప్పుకోవాలి. భార్యను భర్త అతి దారుణంగా కత్తి పొడిచి హత్య చేయడం, గుర్తుతెలియని వ్యక్తుల నివాసాలు, ఆలయాల్లో చోరీలకు పాల్పడడం.. తదితర ఘట నలు చోటుచేసుకొన్నాయి. ఉదయగిరి- కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో ఈనెల 3న భర్త కట్టా మస్తాన్ తన భార్య ఇందిరను హత్య చేసి పరారయ్యాడు. పోలీసులు గాలింపు చేపట్టి మూడు రోజుల తరువాత మస్తాన్‌ను అదుపు లోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. అలాగే వింజమూరు, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని పలు నివాసాలు, ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడి బంగారం, నగదు, వెండి అపహరించుకెళ్లారు. ఆ చోరీలను ఛేదించడంలో పోలీసులు విఫలమయ్యారనే చెప్పుకోవాలి.


హత్యకు గురైన ఇందిర(ఫైల్)

ఆత్మకూరు అటవీ ప్రాంతంలో పులి సంచారం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈ ఏడాది జూన్ 16న అటవీప్రాంతంలో పులి సంచారం కలకలం రేపింది. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి అటవీప్రాంతం సమీపంలో పెద్దపులి రోడ్డు దాటే క్రమంలో ఒక్కసారిగా కారును ఢీ కొట్టిందని కారు డ్రైవర్ తెలిపారు. బద్వేల్‌కు చెందిన ఐదుగురు కారులో వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. కానీ అది పెద్దపులి కాకపోవచ్చని చిరుతపులి అయిఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావించారు. చివరకు చిరుతపులి సంచరిస్తున్నట్లు నిర్ధారించి ప్రజలను అప్రమత్తం చేశారు.


పులి పాదముద్రలు గుర్తిస్తున్న అటవీ అధికారులు

ఖుషీఖుషీగా మందుబాబులు

వైసీపీ హయాంలో నరకం అనుభవించిన మందుబాబులు కూటమి ప్రభుత్వం రావడంతో ఖుషీ అయ్యారు. అక్టోబరు 14న జిల్లావ్యాప్తంగా 182 మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయించారు. దీంతో ప్రైవేట్ వైన్ షాపులు అదేనెల 15 నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఈ దుకాణాల్లో అన్నీ బ్రాండ్లు దొరుకుతుండడంతో మందుబాబులు ఆనందంగా ఉన్నారు. ఇక వైసీపీ ప్రభు త్వం ఎక్సైజ్‌ను రెండు విభాగాలుగా విభజించగా, కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను పాత పద్ధతిలో ఎక్సైజ్‌లో విలీనం చేసింది.

ఎన్నికల్లో శ్రమించిన పోలీసులు

ఎన్నికలకు ముందు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆరీఫ్ హఫీజ్ ఎన్నికల నిర్వహణలో ఎంతో శ్రమించారు. జిల్లాలోని 2470 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరగ్గా, వాటిలో 450 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు రౌడీషీటర్లను, ట్రబుల్ మంగర్స్, గత ఎన్నికల సమయంలో కేసులు ఉన్న సుమారు 10,485 మందిని బైండోవర్ చేశారు. జిల్లావ్యాప్తంగా 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 26క్రైం స్పాట్లు, 26 ఏఎస్‌టీలు, 46 ఎంసీసీ, 105 క్యూఆర్టీ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ. 2,72,31, 845 నగదు, రూ. 2,72,054 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నా రు. 663 కేసులు నమోదు చేసి రూ. 30,56,981 విలువ చేసే 3,999.04 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.


హైవేపై ట్రావెల్స్ బస్సును ఢీకొని నుజ్జునుజ్జు అయిన ఐరన్ లారీ

కావలి వద్ద ఘోర ప్రమాదం : ఏడుగురి దుర్మరణం

కావలి, (ఆంధ్రజ్యోతి): గత ఫిబ్రవరి 10 తెల్ల వారుజామున కావలి ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో రెండు లారీలు, ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో ఏడుగురు మృతి చెందగా, 26 మందికి పైగా గాయపడ్డారు. జిల్లాలో ఘోరమైన రోడ్డు ప్రమాదంగా దీన్ని పేర్కొనవచ్చు.

బుచ్చిలో భారీ చోరీ

బుచిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): గత జూన్ 26వతేదీ రాత్రి బుచ్చిలోని గోపాల్ రెడ్డినగర్ పక్కవీధిలో వెంగళరావు అనే ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. రూ. 5లక్షల నగదు, 53 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. జిల్లాలో ఈ ఏడాది జరిగిన చోరీల్లో ఇదే పెద్దదిగా చెప్పుకోవచ్చు.

విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసింది వైసీపీనే..

● ఇప్పుడు ధర్నాల పేరుతో రోడ్డెక్కడం సిగ్గుచేటు ● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీనే... ఇప్పుడు ధర్నాల పేరుతో రోడె క్కడం సిగ్గుచేటని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శిం చారు. ఆదివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. 'జగన్మోహన్‌రెడ్డి రూ.1.29 లక్షల కోట్ల భారాన్ని విద్యుత్ సంస్థలపై మోపి ఇంటికి పోయాడని, ఐదేళ్లలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారాన్ని మోపాడన్నారు. ఇంత దుర్మార్గపు పనులు చేసిన జగన్మోహన్‌రెడ్డి.. ఇప్పుడు నవ్విపోదురుగాక నాకేంటీ అన్న రీతిలో రోడ్డెక్కడం సిగ్గుచేటు' అంటూ సోమిరెడ్డి తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. కృష్ణపట్నంలోని ఏపీ జెన్‌కో థర్మల్ పవర్ ప్లాంటుకు రూ.281 కోట్ల విలువైన 4.50 లక్షల టన్నుల నాసిరకమైన బొగ్గును సరఫరా చేసి వైసీపీ ప్రభుత్వంలో దోచుకున్నారన్నారు. మట్టి, మషానంతో కూడిన ఆ బొగ్గుతో ప్రాజెక్టు ఉనికికే ప్రమాదకరమని జెన్‌కో ఉద్యోగులు తిరగబడే పరిస్థితి తెచ్చారని గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి నాశనం చేసిన విద్యుత్ రంగాన్ని ఎలా పునరుద్ధ రించాలన్నదానిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లోతుగా ఆలోచన చేస్తున్నారని సోమిరెడ్డి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రి గోల్డ్ బాధిత సంఘం రాష్ట్ర గౌరవా ధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యా లయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. తరువాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి వారి విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషి చేసిన అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్ర మంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, రాందాస్, రాష్ట్ర నాయకులు జీవీ ప్రసాద్, చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

యువకుడి అదృశ్యం

నెల్లూరురూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్లోని అల్లీపురం వద్ద ఓ యువకుడు అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ జీ వేణు ఆదివారం తెలిపారు. యూపీకి చెందిన మోహిత్ (21) బుధవారం తన సొంతూరు నుంచి రూరల్లోని మూడవ మైలుకు చేరుకున్నాడు. గురు, శుక్రవారాలలో అల్లీపురం వద్దనున్న సిరిగార్డెన్స్ వద్ద పానీపూరి వ్యాపారం చేశాడని, శనివారం కూడా వ్యాపారం ముగించుకుని వస్తున్నానని చెప్పిన తరువాత ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. అతని ఆచూకీ ఇప్పటి వరకు లభించనందున పానిపూరి బండి యజమాని అజిత్‌సింగ్ ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ కుమార్ మృతదేహం

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ లోని నెల్లూరుపాళెంలో ఓ అద్దె ఇంట్లో నివాసముం టున్న ఎం ప్రశాంత్ కుమార్ (29) అనే యువకుడు శని వారం సాయంత్రం ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకు న్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఎం ప్రశాంత్‌కు మార్ గత కొంతకాలం నుంచి తన మొదటి భార్యకు దూరంగా ఉంటూ రెండో భార్య అయిన వెంగమ్మతో కలసి ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం ముస్లీం కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంట్లో ఫోన్‌లో మాట్లాడుతుండగా భార్య వెంగ మ్మ ఎవరితో మాట్లాడుతున్నావని ప్రశ్నించింది. దీంతో మనస్తాపం చెంది భార్య బయ టకు వెళ్లగానే ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఆత్మకూరు జిల్లా ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన డాక్టరు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారిం చారు. సమాచారమందుకున్న మృతుడి తండ్రి తన కుమారుడు కుటుంబ కలహాలతో లేక అనారోగ్య కారణాల వలన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయి వినీత్ మృతదేహం

కోవూరు, డిసెంబరు 29, (ఆంధ్ర జ్యోతి) : స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన తంబి సాయి వినీత్ (26) ఆదివారం వేకువజామున మోటారుబైక్‌పై నెల్లూ రు నగరం నుంచి కోవూరుకు జాతీయ రహదారిపై వస్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.... సంగీత కచ్చేరీల ట్రూప్‌లో మృందగం (డ్రమ్స్) వాయిద్య కళాకారునిగా జీవనం సాగిస్తున్న సాయి వినీత్ శనివారం రాత్రి పాటకచ్చేరి ప్రదర్శనకు నెల్లూరు నగరానికి వెళ్ళి తిరిగి ఆదివారం వేకువజామున వస్తుండగా వేగూరు కాలువ సమీపంలో అదుపుతప్పి మోటారుబైక్ డివైడర్‌ను ఢీకొంది. దీంతో కిందపడటంతో తలకు బలమైన కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

నిందితులపై నిఘా



నిందితులతో మాట్లాడుతున్న ఎస్ఐ రంగనాథ్‌గౌడ్

కోవూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మం డల పరిధిలోని పలు నేరాల్లో నింది తులపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టిం దని ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు. ఆదివారం నిందితులుగా ఉన్న యువకులతో పోలీ సుస్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉండాల్సిందిగా సూచించారు. పోలీసు రికార్డుల్లో నమోదై చెడుప్రవర్తన కల్గిన యువ కులపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండయ్యగారిపాలెం పేకాట స్థావరంపై ఆదివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుమల రెడ్డి సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.1280 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	109
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7349
వెండి కిలో ధర	రూ. 89,700
వెండి ఒక గ్రాము	రూ.92.70

సారా స్వాధీనం : విక్రేతల అరెస్టు



బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్న నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నెల్లూరు (క్రైం)/ బిట్రగుంట, (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండల పరిధిలోని ప లు గ్రామాల్లో నెల్లూరు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వ ర్లు, కావలి సిబ్బందితో కలిసి ఆదివారం దాడు లు నిర్వహించారు. బోగోలు చెరువు సమీ పంలో నాగులవరానికి చెందిన తలపల ఏసయ్య నాటుసారా కాస్తుండగా 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తిప్ప సమీపంలోని రామాపురానికి చెందిన కావటి సుధాకర్ ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా, వాహనంతోపాటు అతడ్ని అదుపులోకి తీసుకుని కావలి ఎక్సైజ్ ఎస్సై దేవికకు అప్పగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాపూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని రాపూరు పట్టణం అరుంధతివాడకు చెందిన కొండిపాగు ఈశ్వరయ్య (45) మృతిచెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి స్థానిక భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. వాహనం ఢీకొనడంతో గాయపడిన ఈశ్వరయ్యను మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాపూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన గుర్తుతెలియని వ్యక్తి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన ఆదివారం నెల్లూరు నగరంలోని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయం వద్ద జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి(45) నగ రంలోని ప్రధాన రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో పగలంతా బిక్షాటన చేసుకుంటూ రాత్రి వేళల్లో రంగ నాయకులపేట రైల్వే గేటు సమీపంలోని రైల్వే సీని యర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయం పక్కనే చెట్లకింద నిద్రించేవాడు. ఆదివారం ఆయన దారుణ హత్యకు గురై ఉండటాన్ని స్థానికులు గుర్తించి సంతపేట పోలీసులకు, స్థానిక వీఆర్‌వో సందానిబాషాకు సమా చారం అందించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీని వాసరావు, ఎస్ఐ బాలకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. నిద్రలో ఉన్న సమయంలో దుండగులు చవకర్రతో తలపై తీవ్రగా కొట్టడంతో తలపగిలి మెదడు బైటకు వచ్చి మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తర లించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చుట్టుపక్కల విచారించారు. మృతుడు అదే ప్రాంతంలో బిక్షాటన చేసే ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడని, తరచూ వారి మధ్య గొడవలు జరు గుతుండేవని తెలిసింది. శనివారం రాత్రి ఇద్దరు కలిసి ఉన్నారని స్థానికులు తెలిపారు. ఆదివారం హత్య జరిగిన తర్వాత ఆ మహిళ కన్పించకపోవడంతో ఆమె హత్య చేసిందా... మరెవరైనా హత్య చేసుంటారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

సోమశిలలో 71.828 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 4,100 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.828 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కులు సర ఫరా చేస్తున్నారు.

రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి కృషి

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పక్కన ఆయన సతీమణి సంధ్య తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తూర్పు పడమర ప్రాంతా లను కలిపేలా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివా సులురెడ్డి తెలిపారు. స్టోన్ హౌస్‌పేటలోని పాండు రంగ అన్నదాన సమా జంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి సంధ్య దంపతులను ఆర్యవైశ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. తన రాజకీయ జీవితంలో ఆర్యవైశ్యుల సహకారం మరువలేనిదన్నారు. స్టోన్ హౌస్‌పేటను పొట్టిశ్రీరాములునగర్‌గా మార్చాలని మొదట్లో తానే ప్రతిపాదన తీసుకొచ్చానన్నారు. రెండోసారి నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనకెంతో సంతోషంగా ఉందని పేరొన్నారు. గతంలో తాను నుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ సహకారం చాలా తక్కువగా ఉందని, ఈసారి మంత్రి నారాయణ సహకారంతో అవసరమైతే ముఖ్యమం త్రిని కూడా కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తూర్పు ప్రాంత ప్రజల కష్టాన్ని తీర్చేందుకు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యాపారస్తులను బెదిరించి.. అధికారు లతో దాడులు చేయించారని, అలాంటివి లేకుండా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రము ఖులు భోగనాథం కిషోర్, పెసల నరసింహస్వామి, భవనాపి సురేష్‌బాబు, షణ్ముఖరావు, కోట గురు బ్రహ్మం, శ్రీరామ్ సురేష్, కొండా ప్రవీణ్‌శేఖర్, మెంటా బ్రహ్మగుప్త, దాస లక్ష్మీనారాయణ, ఆర్‌కేటీ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటో, మోటారు బైక్ ఢీ

● బోల్తాపడిన ఆటో
● 12 మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

సంగం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మం డల పరిధిలోని తరుణవాయి క్రాస్ రోడ్డు వద్ద ముంబయి జాతీయ రహదారిపై కూలీల ఆటో ను మోటారు బైక్ ఢీకొనడంతో ఆటో బోల్తా పడగా ఆటో డ్రైవర్‌తోపాటు అందులో ఉన్న 12మంది కూలీలకు గాయాలైన సంఘటన ఆది వారం సాయంత్రం జరిగింది. వివరాల మేర కు.. మండలంలోని చెన్నవరపాడుకు చెందిన 12 మంది వ్యవసాయ మహిళా కూలీలు ఉదయం గ్రామానికి చెందిన శీనయ్య ఆటోలో తరుణవా యిలో పొలాల్లో నాట్లు వేయడానికి వెళ్లారు. సాయంత్రం గం. 5-30 సమయంలో పని ముగిం చుకుని తిరిగి అదే ఆటోలో ఇంటికి బయలుదే రారు. ముంబయి రోడ్డు నుంచి తరుణవాయి క్రాస్ రోడ్డు గుండా చెన్నవరపాడుకు వెళ్లేందుకు ఆటో డ్రైవర్ వెనుక వైపు చూసుకోకుండా రోడ్డు క్రాస్ చేశాడు. దీంతో వెనుక వైపు వేగంగా వస్తున్న మోటారుబైక్ ఆటోను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడడంతో ఆటోడ్రైవర్ శీనయ్యతో పాటు మొత్తం 12 మందికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఆరుగురిని సంగం 108 వాహ నంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మిగిలిన ఆరుగురిని బుచ్చిరెడ్డి పాళెం 108 వాహనంలో సంగం ప్రభుత్వ వైద్య శాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఆటోను ఢీకొన్న మోటారుబైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు మోటారుబైక్‌ను వదిలేసి వెళ్లిపో యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చే సి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు కానిస్టేబుళ్ల ఫిజికల్ టెస్ట్‌కు ట్రయల్ రన్

● పరిశీలించిన ఎస్పీ కృష్ణకాంత్



ట్రయల్‌రన్‌లో లాంగ్‌జంప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు పెరేడ్ మైదానంలో సోమవారం నుంచి ప్రారంభం కాను న్న పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ఫిజికల్ పరీ క్షలకు సంబంధించి ఆదివారం ఎస్పీ కృష్ణకాంత్ పర్యవే క్షణలో ప్రత్యేకంగా ట్రయల్ రన్ నిర్వహించారు. ఐదు గురు పోలీసు కానిస్టేబుళ్లు ట్రయల్ రన్‌లో పాల్గొని రన్నింగ్ ట్రాక్‌లు, ఈవెంట్‌లు పరిశీలించారు. పోలీసు అధికారులు ఫిజికల్ టెస్ట్ ప్రారంభం అయినప్పటి నుంచి చేయాల్సిన విధులను క్షుణంగా చూపించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ పోలీసు కాని స్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఫిజికల్ టెస్ట్‌లకు సం బంధించిన ఈ వెంట్స్‌కు 265 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశా మన్నారు.

మోటారు బైక్ చోరీపై ఫిర్యాదు

కావలి రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మో టారు బైక్ చోరీపై పట్టణంలోని కోపరేటివ్ కాలనీకి చెందిన మేషుశ్యాం ఆదివారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్టోబరు 25వ తేదీ రాత్రి బైకు ఇంటి ముందు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయం చూడగా కనిపించలేదని, బైక్ కోసం గాలించిన అనం తరం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

'ఉన్నతి'తో ఉద్యోగ, ఉపాధి అవకాశం

● 31 రంగాల్లో 215 కోర్సుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ● 100 పనిదినాలు పూర్తయిన కుటుంబాల ఎంపిక
● 90 రోజులు వేతన భృతి, సర్టిఫికెట్ల అందజేత ● నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగావకాశాలు

ఉలవపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో భాగంగా జాబ్ కార్డులతో 100రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల నుంచి ఆసక్తి ఉన్న 18ఏళ్ల నుంచి 45ఏళ్లున్న యువతీయువకులకు విద్యార్హతతో పనిలేకుండా సంబంధిత రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారు. 10తరగతి ఉత్తీర్ణులైనా.. ఫెయిల్ అయినా, డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసి ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్న వారికి ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి కూలీపైనే యువత ఆధారపడకుండా నైపుణ్యంపై దృష్టి మళ్లించడమే ఉన్నతికి లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

● 1280 కుటుంబాలు అర్హత...

మండలంలోని 12పంచాయతీల్లో 12వేల జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 10,200 మంది ఉపాధికూలీ పనులు వినియోగించుకుంటున్నారు. గత ఏడాది 100రోజుల పనిదినాలు పూర్తియిన కుటుంబాలు 1,280ఉన్నాయి. ఉపాధిహామీ సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు చేపట్టిన సర్వేలో ఇప్పటివరకు నైపుణ్య శిక్షణకు ఆసక్తి చూపించిన యువతీ, యువకులు 542మంది ఉన్నట్లు ఎన్‌ఆర్‌ఈజీసీ ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. గుర్తించిన వారంతా శిక్షణకు హాజరైయ్యేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారందిరిని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలులోని రూట్‌సెట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

● 90రోజులు శిక్షణ

ఎంపిక వారికి ఆయా రంగాల్లో 90రోజులపాటు శిక్షణ ఇస్తారు. రోజుకి రూ.300 చొప్పున మూడు నెలలకు రూ.27వేల వేతన భృతి కల్పిస్తూ ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తారు. శిక్షణా కాలం పూర్తయిన తరువాత ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి ఆయా రంగాలకు చెందిన ప్రవేటు సంస్థల్లో వారందరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

● 31 రంగాల్లో 215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణ...

విద్యార్హతతో పనిలేకుండా ఆధునిక వ్యవసాయంలోని యాంత్రిక, డ్రోన్లు ఆపరేటింగ్, పవర్ స్ప్రేలు వాడకం, వరికోత మిషన్ల ఆపరేటింగ్, మహిళలకు బ్యూటీషియన్, ఆధునిక మగ్గం వర్క్స్, కంప్యూటర్ టైలరింగ్, విజి టబుల్ నర్సరీలు, పట్టు, తేనే, పుట్టగొడుగులు పెంపకం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులు, హార్డ్ వేర్ తదితరల 31 రంగాల్లో 215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణలు ఇస్తారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

● ఆంజనేయులనాయక్, వ్యవసాయాధికారి, ఉదయగిరి



ఇంటర్వ్యూ...

ఉదయగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ పేర్కొన్నారు. వ్యాపారస్తుల వద్ద ప్రతి రైతు తాము కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు.

? యూరియా కొరత ఉందా.

! మండలంలో యూరియా కొరత లేదు. సొసైటీలతో ఎరువుల సరఫరా అవుతోంది. రైతుసేవా కేంద్రాలతో ఎమ్మార్పీకే ఎరువులు అమ్ముతున్నారు.

? వర్షాలకు పంట నష్టం జరిగిందా.

! ఫెంగల్ తుపాన్‌తో 46.4 హెక్టార్లలో 94మంది రైతుల పంటలకు నష్టం జరిగింది. వారికి నష్టపరిహారానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

? పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా.

! ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోకుండా ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాపై అవగాహన కల్పిస్తున్నాం. వరి, పెసర, మినుము, శనగ, మామిడి పంటలకు 31వరకు బీమా గడువు ఉంది.

న్యూస్ బాక్స్

టీఐఎస్ గడువు పెంచాలి

అనంతసాగరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల టీఐఎస్ గడువును వచ్చే నెల 31వరకు పెంచాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి ఆదివారం ప్రకటనలో కోరారు. సైట్ పనిచేయక గంటల తరబడి కంప్యూటర్ల ముందు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీల్లో సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దుత్తలూరులో ఆదివారం జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు. నిర్వాహకులు వారికి రూ.15 వేల నగదు, కప్పు అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోలగట్లలో పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

చేజర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలో ముమ్మరంగా జరుగుతోంది. ఆదివారం నెల్లూరు క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్ళూరు గిరినాయుడు ఆధ్వర్యంలో చేజర్ల మండలానికి చెందిన సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి కుటుంబ సభ్యులతో పాటు అన్నలూరు శ్రీనివాసులనాయుడు, కొమ్మి తిరుపతినాయుడు, గొర్ల పెంచలయ్య, వడ్లమూడి పెంచలయ్య గుత్తా వెంకట కృష్ణారావు, షేక్ మస్తాన్, ముళ్ళపూడి హరీష్, స్వర్ణ శాశ్వత సభ్యతం తీసుకున్నారు.

డ్రైనేజీలు మరిచారు..



కొండబిట్రగుంట- ముంగమూరు ఆర్ అండ్‌బీ రోడ్డు కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. దీనికితోడు మండలకేంద్రంలోని ఇళ్లలోని నీరు రోడ్డుపైకి వచ్చి నిలుస్తుంది. రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో అధికారులు మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. రెండునెలలో కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలు జరుగనున్నా గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు తుమ్మలపెంట తారురోడ్డు పనులు

కావలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఐదేళ్లుగా కావలి ప్రజలకు నరకం చూపించిన తుమ్మలపెంట తారురోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కావలి నుంచి తుమ్మలపెంట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. కొనదిన్నె, తుమ్మలపెంట గ్రామాల్లో సీసీ రోడ్డు మిగిలిన ప్రాంతాల్లో తారురోడ్డు నిర్మాణం చేపట్టేలా డిజైన్ రూపొందించారు. పనులు ప్రారంభించేలోపు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ పనులు పాలకులు విస్మరించారు. ఈ రోడ్డులో వెళ్లే వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రెండురోజుల్లో పట్టణ హైవేరోడ్డు వరకు పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.



రోడ్డుకు వేసిన తారు మిక్సింగ్‌ను సరిచేస్తున్న కూలీలు

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే ఇంటూరితో వైసీపీ నేత సయ్యద్ మూసా తదితరులు

కందుకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురు వైసీపీ నాయకులు, వారి అనుచర కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. 5వ వార్డు బృందావనంకు చెందిన చనమాల శ్రీధర్ వెంట పలువురు యువకులు, అలాగే 18వ వార్డుకు చెందిన వైసీపీ నేత సయ్యద్ మూసా వెంట 33కుటుంబాల వారు టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సయ్యద్ మూసా గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి పాటుపడుతున్నారని అందుకు ఆకర్షితులమై టీడీపీలో చే రామన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడారు. పాత, కొత్త నాయకులందరికీ సముచితం స్థానం కల్పిస్తా మన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, పులి నాగరాజు, పొడ పాటి నరసింహ్మం, శ్యామ్, నూకతోటి క్రాంతి పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా నున్నా సంతోష్‌కుమార్

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నున్నా సంతో షకుమార్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆత్మకూ రులో బీజేపీ సీనియర్ నాయకుడు బత్తల కృష్ణయ్య ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా సంతోష కుమార్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో బీజేపీ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకరరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధా కర్, నలిశెట్టి జగదీష్‌లు సంతోష్‌కుమార్‌ను అభినందించారు.



నున్నా సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న నేతలు



జలదంకి: ముడి కిషోర్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

బీజేపీ మండలాధ్యక్షుడిగా ముడి కిషోర్‌రెడ్డి

● జలదంకి: బీజేపీ మండలాధ్యక్షుడిగా ముడి కిషోర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో ఆదివారం పార్టీ జిల్లా ఎన్నికల సహ కన్వీనర్ అంచపాకల కమల, మండల ఎన్నికల పర్యవేక్షకుడు పాలగొల్లు నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. జలదంకి చెందిన ముడి కిషోర్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడికి పార్టీ సీనియర్ నాయకులు బ్రహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, హనుమారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మధు, రాకేష్‌రెడ్డి, రంగయ్యలు అభినందనలు తెలిపారు. అలాగే మండల ప్రముఖ్‌గా రామాల క్రిష్ణారెడ్డి ఎంపికయ్యారు.

రాళ్లపాడులో టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

లింగసముద్రం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెంట్రాల పంచాయతీ రాళ్లపాడు గ్రామంలో ఓ వివాదాస్పద స్థలం విషయం.. పాత కక్షల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం ఆ స్థలంలో ఓ పార్టీకి చెందిన వారు దున్నారు. అయితే ఈ విషయమై రాత్రి 8 గంటల సమయంలో గ్రామానికి చెందిన మరో పార్టీ వారు వచ్చి.. ఈ స్థలంలో ఎందుకు దున్నారని వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం నెలకొంది. మాటమాట పెరిగి రెండు పార్టీల వారు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ దాడిలో ఇరువ ర్గాలకు చెందిన వారికి తలలకు, కాళ్ల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభానీ హుటాహుటిన రాళ్లపాడు వెళ్లి పరిస్థితిని సమీక్షించి, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

టిప్పర్ల రాకపోకలతో రోడ్డు అధ్వానం



కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు-పామూరు రోడ్డు నుంచి వెంకటా ద్రిపాలెంకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. 167బీ హైవే నిర్మాణానికి కాంట్రాక్టరు భూములు కొనుగోలు చేసి అక్కడి నుంచి భారీ టిప్పర్లతో గ్రావెల్ తరలించడంతో ఈ దుస్థితి నెలకొంది.

బీటీఏ నేతకు నివాళి



నివాళులర్పిస్తున్న బీటీఏ నాయకులు

కందుకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు దార్ల నరసింహ అకాల మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి రమేష్ వాపోయారు. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొని నివాళులర్పించారు. అంబేడ్కర్ వాది, బుద్ధిస్ట్ అయిన దార్ల నరసింహ అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళ్లగుంట మోహనరావు, పర్రె వెంకటరావు, పల్లం వేణుగోపాల్, ఆదినారాయణ, మాల్యాద్రి, కావలి ఎంఈఓ బండి గోవిందయ్య, వివిధసంఘాల నాయకులు పల్నాటి శ్రీరాములు, మల్లికార్జునరావు, మాధవరావు, గాండ్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బిట్రగుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేటలో ఆదివారం అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ వ్యవస్థాపకురాలు జీవీ శైలజ ఆధ్వర్యంలో సభ్యులు గ్రహణం, మొర్రి బాధితులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిన్నమ నేని సిద్ధార్థ మాట్లాడారు. విజయవాడ గన్నవరంకు చెందిన పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ వారితో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు గ్రామాలకు చెందిన 20మందికి వైద్య పరీక్షలు చేసి వారిలో 5మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మిగిలిన వారికి ఉచిత మందులు అందజేశారు. జనవరి 11 నుంచి 20వరకు టెస్టులు నిర్వహించి తదుపరి ఆపరేషన్లు చేస్తామన్నారు. పేషట్లకు ప్రయాణ ఖర్చులు, భోజన వసతులు సంస్థ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు గండూరి మంజుల, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, జయరామయ్య ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సేవాసమితి బాధ్యులు

కావలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కమ్మవారి సేవాసమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం సాయంత్రం వెంగళరావునగర్‌లోని సేవాసమితి కార్యాలయంలో సమితి బాధ్యులు ఆవిష్కరించారు. జనవరి 5న పెద్దపవని రోడ్డు పీజీ సెంటర్ సమీపంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో సమితి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు మాకినేని మాల్యాద్రి, కూరపాటి రమేష్, బాధ్యులు విశ్వశాంతి రమణయ్య, శ్రీనివాసులు నాయుడు, బోట్లగుంట శ్రీహరి నాయుడు, వేలూరి జయచంద్రనాయుడు, అంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంగమేశ్వరుడికి లక్ష బిల్వార్చన

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరస్వామికి మార్గశిర బహుళ చతుర్దశి సందర్భంగా ఆదివారం లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో ని ర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఉదయం గణపతి పూజ, స్వస్తివాచకము, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు లక్ష మారేడు ఆకులను గంపలు, తట్టలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం 8గంటల నుంచి లక్ష బిల్వార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

పాకెట్ మనీతో చిన్నారుల దుప్పట్లు పంపిణీ



సంగం : గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగం గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాల మేరకు.. ఓ పాఠశాలలో చదివే హిమ రవిశంకర్, నిఖిల్, రిషి, మహిధర్‌లు స్నేహితులు.ఉపాధ్యాయుల సూచనలతో తాము ఏదో ఒక మంచి పనిచేయాలని తలచారు. దీంతో పాఠశాలకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు వారికి ఖర్చుల కోసం ఇచ్చిన నగదును పొదుపుచేసి 50దుప్పట్లు కొనుగోలు చేశారు. వాటిని చలితో ఇబ్బందులు పడుతున్న చల్లా యానాదులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఆదివారం అందచేశారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం నేతలు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ మహాసంఘం నేతలు

● కావలి టౌన్: పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఆదివారం బ్రాహ్మణ మహా సంఘం సభ్యులు యాచకులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు పీవీఎస్ ప్రసాద్ అధ్యక్షత జరిగిన కార్యక్ర మంలో కళాధర్‌రావు, వెంకటేశ్వర్లు, గంగు చంద్రశేఖర్, వెంకట సుబ్రమణ్యం, రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

● లింగసముద్రం: మండల ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభానీ, సర్పంచు పులి రాఘవులు స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రామకృష తదితరులు ఉన్నారు.

యువకుడిని రక్షించిన మెరైన్ కానిస్టేబుల్

కావలి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట సముద్ర స్నానానికి వెళ్లి అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతున్న సర్వాయపాలెం వదినాల సురేష్‌ను ఆదివారం సాయంత్రం మెరైన్ కానిస్టేబుల్ గోవిందరాజు కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఈయన గ్రామానికి చెందిన మరో ఇద్దరు రొయ్యల గుంటల వద్ద రోజువారి కూలీలు. ఆదివారం సెలవుదినం కావడంతో స్నేహితులతో వచ్చి స్నానం చేస్తుండగా ఈ ఘటన జరిగింది. విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి సముద్రంలో కొట్టుకుపోతున్న సురేష్‌ను కాపాడిన కానిస్టేబుల్ గోవిందరాజును సీఐ దాసరి ప్రసాద్, ఎస్‌ఐ కిషోర్‌బాబు అభినందించారు.

పంచాయతీ అభివృద్ధికి చర్యలు

ఉదయగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాలక మండలి, ప్రజల సహకా రంతో పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు సర్పంచ్ గొల్లపల్లి కల్పన పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గంతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీలో ఏర్పాటు చేయాల్సిన రహదారులు, డ్రైన్ల నిర్మాణంపై చర్చించారు. వీధిదీపాల ఏర్పాటుతోపాటు పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, కార్యదర్శి నాగూర్‌బీ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం



మంత్రిని ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ వాణీశ్రీ

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీల్లో వైసీపీ రద్దు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించడం విద్యార్థులకు వరం అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరు ప్రభుత్వ జూని యర్ కాలేజి ప్రిన్సిపాల్ వాణీ శ్రీ, అధ్యకులు ఆదివారం నెల్లూరులో ఆనం రామనారాయణరెడ్డిని కలిసి జనవరి 3న మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే..

ఉదయగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్లు భారం మోపారన్నారు. వారే విద్యుత్ చార్జీలు పెంచి వారే ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ రియాజ్, అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉదయగిరిలో శ్వేతపత్రాలు ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు


అలరించిన సంక్రాంతి పోటీలు



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సౌజన్యంతో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి పోటీలు అలరించాయి. పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయం సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులు, కోలాటం, సంక్రాంతి లక్ష్మీ, కర్రసాము, కుస్తీ తదితర పోటీలు కొనసాగాయి. పాఠశాలల విద్యార్థులకు శాస్త్రీయ సంగీత, నృత్య పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. అనంతరం సోమవరపు సుబ్బరాయుడు అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటుచేసి కంచి పరమేశ్వరరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ గంగాధర్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చంద్రా వెంకటసుబ్బానాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, తెలుగు భారతి సేవా సమితి నేతలు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలినడక మార్గం



స్థానిక చెరువు కట్ట రెండవ తూము వద్ద కాలినడకన పొలాల్లోకి కట్టపై నుంచి కిందకు దిగే మార్గం ప్రమాదభరితంగా మారింది. మెట్లకు పూతపనులు చేయక రాళ్లు తేలి జారుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు వ్యవసాయ సామాగ్రితో పాటు, ఎరువులు కిందకు తీసుకెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. ఇరిగేషన్ అధికారులు చొరవ చూపి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



సోమిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు మురళి

ఆలయ భూములను పరిరక్షించండి

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): ఈపూరులోని విరూపాక్ష స్వామి చెనసకేశవ స్వామి ఆలయాలకు చెందిన దేవదాయశాఖ భూముల్లోని ఆక్రమణలను తొలగించాలని టీడీ పీ మండల నాయకులు మునుకూరు మురళీధర్‌రెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, పేర్నేటి రామ్మోహన్ రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబరు 605లో 14, 15 ఎకరాల ఆలయ భూములను వైసీపీ నాయకుల అండదండలతో ఆక్రమించేశారని తెలి పారు. విలువైన ఆలయ భూములను పరి రక్షించాలని కోరారు.

కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ

కోవూరు,(ఆంధ్రజ్యోతి) : కర్నూలులో జనవరి 3నుంచి జరగనున్న 50వ అంతర జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడా కారులకు స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రెండు రోజులుగా శిక్షణ పొందుతున్నారు. పూర్వ కబడ్డీ క్రీడాకారులు, కోచ్‌లు లక్ష్మీకాంతం, కొండ లరావు, మునిచంద్ర వారికి శిక్షణ ఇస్తున్నారు. కబడ్డీ క్రీడలో జిల్లాకు పూర్వవైభవం తీసుకు రావాలనే దీక్షతో క్రీడాకారులు శిక్షణ పొందుతు న్నారని టీమ్ మేనేజర్ విజయానందం తెలిపారు.

రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛంద రక్తదానం

నెల్లూరు(వైద్యం), (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు ధనరాజ్ ఫౌండేషన్ మోటివేటర్ షేక్ సాబీర్, షేక్ షఫీ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌క్రాస్‌లో ఫౌండేషన్ సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి ప్రారంభించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు, మెడికల్ షాపు కన్వీనర్ మురళీకృష్ణ, మోటివేటర్లు భాస్కర రావు, సాయిరాం, రెడ్‌క్రాస్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం అజంతా హైస్కూల్‌లో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను మిద్దె శ్రీనివాసరావు, బయ్యా శ్రీనివాసులు నిర్వహించారు. పోటీలను గీతా వైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్ బాషా, అజంతా హైస్కూల్ ఉపాధ్యాయులు లలిత, నాగేశ్వరి, ఉషారాణి, వీరయ్య, సుబ్బమ్మలు పర్యవేక్షించారు.

పెంచలకోనలో సోషల్ యాక్టివిస్ట్ సీమరాజా సందడి

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో సోషల్ మీడియా యాక్టివిస్ట్ సీమరాజా సందడి చేశారు. శ్రీవారి దర్శనార్థం ఆదివారం పెంచలకోనకు వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి తీర్థప్రసా దాలు అందజేశారు. అక్కడికి వచ్చిన భక్తులు సీమరాజాతో సెల్ఫీలు తీసుకున్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



ఎన్నికల సమయాల్లో కనిపించే ఎమ్మెల్యేను కాదు : శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయాల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు వచ్చే ఎమ్మెల్యేని కాని, ఎల్లప్పుడు అభివృద్ధే లక్ష్యంగా ప్రజల మధ్యన ఉండే వ్యక్తినని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ బిట్-2లో రూ.40 లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్లకు శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులున్నా ఫోన్ చేసి, లేదా మెసెజ్ పెట్టినా తనతో పాటు తన కార్యాలయం స్పందిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు కేవలం టెంకాలయకే పరిమితమయ్యాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ఈ డివిజన్‌లో గడిచిన ఆరు నెలల కాలంలో రూ. 1.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ సుప్రజ, నాయకులు సురేంద్రబాబు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: సోషల్ వెల్ఫేర్ డీడీ

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు29:(ఆంధ్రజ్యోతి): స్థానిక వసతిగృహాల్లో వుండే పదవ తరగతి విద్యా ర్థులందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేం దుకు కృషిచేయాలని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి వార్డెన్‌లను ఆదేశించారు. ఆదివారం ఆమె బుచ్చిలోని ఎస్‌సీ బాలుర వసతి గృహంతో పాటు అన్ని వసతిగృహాలను సందర్శించారు. సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల భోజనం, వసతులు, సమస్యల గురించి ఆరా తీశారు. ఎస్‌సీ హాస్టల్ భవనం మరమ్మతులకు రూ.22లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

వార్డెన్‌పై ఆగ్రహం

హాస్టల్లో వంట గది, కుళాయిలు లేకపోవడం, బాత్‌రూంలు, మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లడం, విద్యార్థులు పడుతున్న అవస్థలు పరిశీలించిన డీడీ శోభారాణి వార్డెన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సాయంత్రానికి కుళాయిలు ఏర్పాటుచేసి ఫోటోలు పెట్టాలని ఆదేశించారు.

కామాక్షితాయి సేవలో డీఆర్వో

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను జిల్లా రెవెన్యూ అధికారి కే ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు వారిని స్వాగతించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు అందజేశారు.

వైభవంగా గంధ మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పెద్ద దర్గా ఖాజాపీర్ బందా నవాజ్ గంధ మహోత్సవం చిన్నబజార్ మెయిన్‌రోడ్డులో ఖాజా పీర్ మఖాన్ ఆసార్ ఘర్ నుంచి శనివారం అర్ధరాత్రి బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున దర్గా చేరుకుంది. ఉదయం 5గంటలకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పీఠాధిపతులు, దర్గా పీఠాధిపతులు గుల్బర్గా ఖాజా బంద నవాజ్ మనవడు ఖాజా పీర్ నెల్లూరు పైన్న దర్గా సమాధికు గంధం లేపనం చేశారు. పీఠాధిపతి కేఎస్.బాబాసాహెబ్ సాహెబ్ బాందా నవాజ్ సర్వమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి ఉండాలని ప్రత్యేక దువా చేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు పీఠాధిపతులు మొహమ్మద్ సాహెబ్, దర్గా పీఠాధిపతులు కెఎస్ఎస్ బాబాసాహెబ్ బందా నవాజ్, రఫాత్ హుసేనీ సాహెబ్, యూసుఫ్ హుసేనీ సాహెబ్, సర్ఫ్రోజ్ హుసేనీ సాహెబ్, ఫయాజ్ రాజ్వీసాహెబ్, మత పెద్దలు పీఠాధిపతులు పాల్గొన్నారు. తర్వాత ప్రజలకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

వివేకానంద వాకర్స్‌కు ఎక్సలెంట్ అవార్డ్



ఎక్సలెంట్ అవార్డు అందుకుంటున్న వివేకానంద వాకర్స్

నెల్లూరు(విద్య), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వె న్షన్‌లో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఎక్సలెంట్ వాకర్స్ క్లబ్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పడిన అనతికాలంలో వినూత్న కార్యక్రమాల నిర్వహణతో పాటు విస్తృత సేవా కార్యక్రమా లతో మెరుగైన సేవలు అందించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. ఉత్తమ వాకర్స్ క్లబ్‌తో పాటు ఉత్తమ అధ్యక్షుడు, ఉత్తమ కార్యదర్శి అవార్డులతో పాటు రూ.15వేల నగదు ప్రోత్సాహకాన్ని కూడా ఈ అసోసియేషన్‌కే అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, అధ్యక్షుడు డీవీ.సుబ్బరాజు, కార్యద ర్శి రమేష్ బాబు, కోశాధికారి కె.జయదేవ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, సభ్యులు జీకే.గోపీనాథ్ , హరిరావు, కేపీ.రెడ్డి, మేకల మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి

● మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రమాదేవి, గునుకుల కిషోర్, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతం ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి తదితరులు ఐక్యంగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. ఆదివారం మూలాపేట కాపు భవన్‌లో జరిగిన రాయలసీమ బలిజ మహాసంఘం ఆత్మీయ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ఏడాది ఇదే సమావేశంలో పాల్గొన్నానని, ఈ ఏడాది ఇదే కార్యక్రమంలో పాల్గొనడం మన ఇంట్లో జరుపుకునే వేడుకగా ఉందన్నారు. పొంగూరి నారాయణను సోదరుడి, తనను తోబుట్టువుగా భావించి ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమ బలిజ మహాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహరిరాయలు మాట్లాడుతూ గత ఎన్నికల్లో బలిజలు ఐక్యంగా ఉండి పనిచేసినం దున అత్యంత గౌరవం దక్కిందన్నారు. కాపు భవన్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రమాదేవిని కోరారు. అనంతరం వంగవీటి మోహనరంగా, మిరియాల వెంకట్రావు, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. అనంతరం నూతన క్యాలెండర్ ఆవిష్కరించి పేద కాపు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. సీనియర్ కాపు నాయకులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్, డాక్టర్ పోకల రవి, అంజనీ నాగేశ్వరరావు, రేవతి, దూది రమణయ్య, ఎస్.చక్రధర్, బ్రహ్మం రాజేంద్ర, బ్లిస్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి సేవలో ఎన్ఎంసీ కమిషనర్ దంపతులు



స్వామి వారి సన్నిధిలో కమిషనర్ దంపతులు

నెల్లూరురూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రంలో వెలసిన లక్ష్మీనరసింహుడిని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చక బృందం ఘన స్వాగతం పలికింది. అనంతరం స్వామి వారి సన్నిధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలను అందించారు. అక్కడ నుంచి పొదలకూరు మండలం మహ్మదాపురంలోని నెల్లూరుకు తాగునీటిని సరఫరా చేసే పంపింగ్ హౌస్‌కు వెళ్లిన కమిషనర్ అక్కడ కొన్ని సమస్యలను గుర్తించారు. వాటిని వారంలోపు పరిష్కరించాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. వారం తరువాత మళ్లీ తాను వస్తానని అప్పటికి ఈ సమస్యలు ఉండకూడదని స్పష్టం చేశారు.

చందన, సీఎంఆర్ ఎక్స్‌ప్రెస్ సేల్ బంపరు డ్రా విజేత హనీషా



సీఎంఆర్‌లో వీక్లీ డ్రా విజేతకు టీవీఎస్ స్కూటీ అందజేస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చందన సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో క్రిస్మస్, న్యూయర్, సంక్రాంతి ఎక్స్‌ప్రెస్ సేల్స్ జోరుగా సాగుతున్నాయి. ఆదివారం సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో క్రిస్మస్ బంపరు డ్రా తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొని లక్కీడిప్ తీశారు. బంపరు డ్రాలో పడుగుపాడుకు చెందిన హనీషా (కూపన్ నెంబరు 28991)కు కారు దక్కింది. ఆమెతో అజీజ్ ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు. అనంతరం గత వారం వీక్లీ డ్రాలో టీవీఎస్ స్కూటీ గెలుచుకున్న వై.సుజాతకు స్కూటీ అందజేశారు. అలాగే డైలీ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ చందన సీఎంఆర్ అధినేతలు తక్కువ లాభాలకు వస్త్రాలు, బంగారు ఆభరణాలు విక్రయిస్తూ పండుగ సీజన్‌లో లక్కీ డ్రా ద్వారా విలువైన బహుమతులు అందజేస్తుండడం అభినందనీయమన్నారు. విలువైన బహుమతులు పొందాలనుకునేవారు చందన సీఎంఆర్‌లలో కుటుంబానికి అవసరమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు ఎక్స్‌ప్రెస్ సేల్స్ గురించి, అందజేస్తున్న విలువైన బహుమతులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వాసు, శైలేష్, మోపూరు పెంచలయ్య, ఎం.వెంకటగణేష్, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల చిత్రలేఖన పోటీలు



అవార్డులు, ప్రశంసా పత్రాలతో చిన్నారులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని పురమం దిరంలో ఆదివారం అమీర్ ఆర్ట్స్ అకాడమీ 9వ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు, బహుమతి ప్రదానో త్సవం జరిగింది. తొలి విడతలో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొనగా జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలలో ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి బంగారు పతాకాలు అందజేశారు. మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో నెల్లూరు, ఇతర జిల్లాలకు చెందిన 46 పాఠశాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం చిత్రలేఖనంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డు స్థానం సాధించిన నంద్యాల కోటేష్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థికి ఒక గ్రాము ప్యూర్ గోల్డ్‌మెడల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు అమీర్‌జాన్, నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం సీహెచ్.భాస్కర్‌రెడ్డి, 25 కళాసంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, కోమల ఆర్ట్స్ అధినేత్రి అన్నపూర్ణ, అధ్యక్షుడు దోర్నాదుల హరిబాబు, ప్రముఖ చిత్రకారుడు షేక్.అబ్దుల్లా, రంగుల సంధ్య, బి.సూర్యనారాయణ, డాక్టర్ ఆనందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

మూలాపేట మండల బీజేపీ అధ్యక్షురాలిగా పద్మావతి

నెల్లూరు(క్రైం),డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మండల బీజేపీ అధ్యక్షురాలుగా చిత్తూతూరు వెంకట పద్మావతి ఎన్నికయ్యారు. ఆదివారం ఎన్నికల అధికారి వెంకట రాఘవేంద్ర ఆధ్వర్యంలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షులు అందరూ కలిసి ఆమెను అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, అల్లూరు నాగేంద్రసింగ్, గంధవల్ల దశరథరామయ్య, పేట రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఏఐవైఎఫ్

ముత్తుకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాల యంలో ఆదివారం నిర్వ హించిన ఏఐవైఎఫ్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయినట్లు చెప్పారు. పేదల సంక్షేమం అంటూ గుప్పించిన హామీలు అధికారంలోకి వచ్చాక అమలుకు నోచుకోలేద న్నారు. నిరుద్యోగ సమస్య యువతను ఇబ్బందులకు గురి చేస్తుంద న్నారు. ప్రజల సమ స్యలపై రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై సోమవారం అన్నిమండల కేంద్రాల్లో జరిగే ధర్నాను విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు, మండల నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రెడ్‌క్రాస్ కమిటీని రద్దు చేయాలి

నెల్లూరు(వైద్యం), (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ అంతా వైసీపీ మయమవడంతో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై కలెక్టర్ ఆనంద్ దృష్టి సారించి రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీని రద్దు చేయాలని రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యుడు మక్కెన అంకయ్యచౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిటీ పాల్పడుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభు త్వం సీబీఐ, సీబీసీఐడీతో విచారణ చేయించాలని తెలిపారు. వైసీపీ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న చంద్రశేఖరరెడ్డి రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్‌గా కూడా ఉండడంతో రెడ్‌క్రాస్ కార్యాల యాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చేశా రని పేర్కొన్నారు. 2023లో జరిగిన రెడ్ క్రాస్ ఎన్నికల్లో అక్రమంగా తన విద్యా సంస్థలలో పనిచేస్తున్న వారిని రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యులుగా చేర్చి గెలిచారని పేర్కొన్నారు. అప్పట్లో హైకోర్టుకు కూడా వెళ్లామని, కోర్టు ఎన్నికలు జరిగినా ఫలితాలు వెల్లడించవద్దని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇలాంటి స్థితిలో రెడ్‌క్రాస్ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కోడిపందెం స్థావరంపై దాడి

వెంకటాచలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చెముడుగుంట చెరువు వెనుక వైపు ఆదివారం జరిగిన కోడిపందెం స్థావరంపై వెంకటాచలం సీఐ పి.సుబ్బారావు పోలీస్ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఈ సందర్భంగా రెండు కోళ్లు, ఇద్దరు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2140 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

రైల్వే స్టేషన్‌మాస్టర్‌కి సన్మానం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు రైల్వే స్టేషన్ మాస్టర్ బి.శివయ్యకు ఘన సన్మానం జరిగింది. ఆచారివీధిలోని క్లోవ మర్చంట్స్ అసోసియేషన్ మందిరం సీనియర్ సిటిజన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ క్యాలెండరు ఆవిష్కరించారు. నూతన సంవత్సర గిఫ్ట్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి సి.కృష్ణమూర్తి, ఎ.సుబ్బారావు, ఎన్.వి.కృష్ణయ్య, బొమ్మిశెట్టి మురళీకృష్ణలు పర్యవేక్షించారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫోర్‌వీలర్స్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సింహపురి వీబీపీ డ్రైవర్స్ సంఘం నాయకుడు సూరి చెప్పారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు మణి మాట్లాడుతూ ఫోర్ వీలర్స్ డ్రైవర్లకు ఎక్కడా విలువ ఉండటం లేదన్నారు. వారికి గౌరవం వచ్చేలా కృషి చేస్తామన్నారు. వారికి గుర్తింపు కార్డులు అందచేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో చిరంజీవి పాల్గొన్నారు.

సేవ చేయడం అందరి బాధ్యత

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సేవ చేయడం ప్రతి ఒక్కరు విధిగా భావించాలని ప్రముఖ న్యాయవాది పొన్నవేలు మధుసూదన్ రెడ్డి అన్నారు. క్రిష్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏబీఎం కాంపౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్త్రీలు, పురుషులకు నూతన వస్త్రాలు అందించడంతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రేమ్‌కుమార్, కవిత, ప్రసాద్‌రెడ్డి, జయప్రకాష్, సిస్టర్ సరోజ, ఫాదర్ అజయ్ పాల్గొన్నారు.

సాహితీ సంస్థలను ప్రభుత్వం పోత్సహించాలి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సాహితీ సంస్థలు ప్రభుత్వ ప్రోత్సాహం లేక మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని నెల్లూరు రచయితల సంఘం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ తెలిపారు. విజయవాడలో శని, ఆదివారాల్లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో నెల్లూరు రచయితలు, కవులు డాక్టర్ పెళ్లకూరు జయప్రద, డాక్టర్ పాతూరి అన్నపూర్ణ, నజ్మాబేగం, భారతి, గోవిందరాజుల సుభద్రాదేవి, బొగ్గవరపు శ్రీమన్నారాయణ, హస్తి మోహన్‌రాజు, గండికోట సుధీర్‌కుమార్, టేకుమళ్ల వెంకటప్పయ్య పాల్గొని ప్రసంగించారు. కవితలు చదివారు. సాహితీ సంస్థల ప్రతినిధుల సమావేశంలో పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు.

కుడితిపాలెంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దువ్వూరు కల్యాణ్‌రెడ్డి యువత

ఇందుకూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుడితిపాలెం పల్లెపాలెంలో యువనేత దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రాథమిక పాఠశాలలో నెల్లూరు రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఎన్డీఏ కూటమి నాయకులు, అప్పాని రమణయ్య, బెజవాడ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వంద మంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు పండ్లు, గోడ గడియారం బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీకేఆర్ యువత, దేవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, షేక్ ముజీర్, గున్నం కిషోర్, పొట్లూరి నరేంద్ర, ఒలిముడి శ్రీకాంత్, ఆమారి సుధాకర్, గంపల సుబ్రహ్మణ్యం, ఊటుకూరు నాగరాజు, గుడి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులు ఐక్యంగా ఉండాలి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని తూర్పు, పడమర ప్రాంతాల్లో ఉన్న అగ్నికుల క్షత్రియులందరూ ఐక్యంగా ఉండాలని, పెత్తనం కోసం దిగజారుడు చర్యలకు పూనుకోవద్దని జిల్లా అగ్నికుల క్షత్రియ మాజీ సభ్యుడు నగరి చంద్రశేఖర్, మిట్టా ధనుంజయ హితవు తెలిపారు. ఆదివారం శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో అగ్నికుల క్షత్రియుల సమావేశం జరిగింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అగ్నికుల సంఘం జిల్లా నాయకులమంటూ కొందరు చెలామణి అవుతున్నారని తెలిపారు. అగ్నికుల క్షత్రియులకు చెందిన మూలాపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయం భూములు, అరణి కందప్ప మేస్త్రీ సత్రం భూములు, గూడూరు ధర్మరాజులస్వామి ఆలయ భూములు ఆక్రమణలకు గురై ఉన్నాయని, వాటిపై ఆ నాయకులు ఏమి చర్యలు తీసుకున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. వాట్సప్ ద్వారా నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయం అభివృద్ధిని అడ్డుకుంటూ దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అగ్నికుల క్షత్రియులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్ఐ వీరేంద్రబాబు తెలి పారు. ఆదివారం నరుకూరు సెంటర్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి అపరాధ రుసుం వేశారు. అనం తరం ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని తెలిపా రు. యువకులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన వెంట హెడ్ కానిస్టే బుల్ శరత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగు పంచాయతీ మఠం కాలనీ వద్ద 50 నిరుపేద గిరిజన కుటుంబాలకు నాగార్జున మొబైల్స్ యజమాని బీసీసేన జిల్లా అధ్యక్షుడు నిమ్మల నాగార్జున యాదవ్, అనూషా దంపతులు ఆది వారం దుస్తులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత నాగార్జున మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల తరపున నూతన సంవత్సరం సందర్భంగా ముందస్తుగా గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు వెంకటేశ్వర్లు, వంశీ, లక్ష్మణరావు, సునీల్, కరీం పాల్గొన్నారు.

యాదవ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదవ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయింది. నెల్లూరు నగరంలోని కొత్తూరు యాదవ ఎంప్లాయిస్ సొసైటీ భవనంలో ఆదివారం జరిగిన ఈ ఎన్నికలో జిల్లా గౌరవాధ్యక్షుడిగా డబ్బుగొట్టు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా జడ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దాసరి యుగంధర్, నిర్వాహక కార్యదర్శు లుగా గాలం చెంచలబాబు, శేషాద్రి, జనార్దన్, ఉపా ధ్యక్షులుగా ఎం.ప్రభాకర్, పీ.ప్రసాద్, సీహెచ్.నరేష్, కార్యదర్శులుగా గోపాల్, మధుసూదన్‌లు ఎన్నిక య్యారు. అలాగే రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రమే ష్, కామాక్షయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ రానున్న సంవత్సరంలో జిల్లాలోని యాదవ పేద విద్యార్థులు పది మందికి ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వచ్చే యాదవ ఉద్యోగులందరికీ కూడా యాదవ భవన్‌లో ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.



యాదవ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి ఎవరూ రావద్దని సూచించారు. ప్రజలు వినతులను ఆయా పోలీసుస్టేషన్లలో ఇవ్వవచ్చు నని పేర్కొన్నారు.

2024 పెరిగిన హత్యలు.. అత్యాచారాలు

జిల్లా పరిధిలో గతేడాదితో పోలిస్తే హత్యలు, అత్యాచారాలు పెరిగాయి. 2023 తో పోలిస్తే సాధారణ నేరాలు దాదాపు 3.45 శాతం తక్కువగా నమోదయ్యాయి. సైబర్ నేరాలు ఈ ఏడాది అంతకంత పెరగడం ఆందోళన కలిగించే విషయం. నాలుగు నెలలుగా జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలతో ఈ ఏడాది నేరాలు కొంత వరకు అదుపులోనే వున్నాయి.



మే 27వ తేదీన చంద్రగిరి మండలం కొంగరవారిపల్లె వద్ద జరిగిన ప్రమాదం



నేరాలు	2023	2024
దొంగతనాలు	775	749
కన్నం వేసినవి	190	212
దోపిడీలు	15	13
హత్యలు	39	52
కిడ్నాప్‌లు	18	25
అత్యాచారాలు	38	49
మోసాలు	443	468
హత్యాయత్నాలు	75	65

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

అతివేగం, నిర్లక్ష్యం, నిద్ర, మద్యం మత్తు... ఈ కారణాలతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఈ ఏడాది జిల్లాలో 1048కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 428 మంది మృత్యువాత పడగా, 1424 మంది గాయపడ్డారు. వీరిలో కొందరు అంగవికలాంగులుగా మారారు. ఈ రోడ్డు ప్రమాదాల్లో ప్రధానంగా.. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లె వద్ద జరిగింది. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట నుంచి కారులో ఈ ఏడాది మే 27న వేలూరు సీఎంసీకి బయలుదేరారు. ఎం.కొంగరవారిపల్లె సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొంది. ఈప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు.

తగ్గిన దోపిడీలు

● ఈ ఏడాది దారి దోపిడీలు, దొంగతనాలు, చోరీలు బాగా తగ్గాయి. ఈ ఏడాది జూన్ 13న రేణిగుంట మండలం నేతాజీ కాలనికి చెందిన చిన్నబ్బ ద్విచక్ర వాహనంపై తిరుచానూరు రైల్వే స్టేషన్ దారిలో రేణిగుంట వైపుకు వెళుతుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు నెంబరు ప్లేటు లేని స్కూటీపై వచ్చి ఎనిమిది గ్రాములు బంగారు చైను, అతడి వద్ద ఉన్న రూ.16,000 నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు.



● శ్రీకాళహస్తి పరిధిలోని హ్యాపీ కిచెన్ సెంటరు వద్ద అక్టోబరు 20న జరిగిన దారి దోపిడీ ఘటనలో పెళ్లకూరు మండలం ఆలపాడు గ్రామానికి చెందిన చంద్రయ్య తన సోదరుడు కాకాని తేజతో కలసి ఆటోలో వెళుతుండగా రెండు ద్విచక్రవాహనాల్లో నలుగురు దుండగులు వెంబడించి ఆటో ముందు వుంచి వారిని కొట్టి రెండు సెల్ ఫోన్లు లాక్కొన్నారు. రూ.64,750 నగదు తీసుకెళ్లారు.

ఇంటికి నిప్పుపెట్టి..

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది హత్యలు పెరిగాయి. గతేడాది 39 జరగ్గా.. ఈ ఏడాది ఆ సంఖ్య 52కు చేరుకుంది. వీటిలో ప్రధానంగా.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కేసవనగర్ ఘటన చోటుచేసుకుంది. జ్యోతిప్రసాద్, ఆయన భార్య పార్వతి, సమీప బంధువు మహేష్ జనవరి 30న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. వీరి కేకలతో ఇరుగు పొరుగు వారు తలుపులు బద్దలు కొట్టి నీళ్లు పోసి మంటలను అదుపు చేశారు. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించారు. వారం రోజుల్లో ఈ ముగ్గురూ అసువులు బాశారు.

పెరిగిన దారి దొంగతనాలు



● సత్యవేడు మండలం తెలుగుగంగ కాలువ సమీపంలోని చిన్నపాండూరు రోడ్డు వద్ద నాగలాపురం మండలం రాజులకండిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై అపోలో కంపెనీకి విధులు నిమిత్తం రాత్రి వెళుతున్నారు. ఇద్దరు దుండగులు అతడిని అడ్డగించి కత్తులతో బెదిరించారు. రూ.45,000 విలువ చేసే మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనంతో పాటు నగదు తీసుకుని అక్కడ నుంచి ఉడాయించారు. ఇలా.. ఈ ఏడాది 510 వరకు దారి దొంగతనాలు జరిగాయి.

● ఆగస్టు 27న నాయుడుపేట పట్టణం రాజగోపురం ప్రాంతానికి చెందిన వేముల బాలాజీకి చెందిన లారీలో స్టీలు పైపులు తీసుకొస్తున్నారు. నాయుడుపేట సమీపంలో గుర్తు తెలియని దుండగులు ఆపి దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే స్టీలు పైపులున్న లారీని అపహరించుకుని వెళ్లారు.



అత్యాచారాలు.. హత్యాచారాలు

జిల్లా వ్యాప్తంగా గతేడాది 38 అత్యాచారాలు జరగ్గా.. ఈ ఏడాది 49కి పెరిగాయి. డీవీ సత్రం ప్రాంతంలో జూలై 17న ఎనిమిదేళ్ల బాలికను ఓ వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేశాడు. నవంబరు 1న వడమాలపేట మండలంలో ఓ బాలికపై సమీప బంధువే హత్యాచారానికి ఒడిగట్టాడు.

వంద శాతం పెరిగిన సైబర్ నేరాలు



జిల్లాలో సైబర్ నేరాలు వంద శాతం పెరిగాయి. గత ఏడాది దాదాపు 320 కేసులు నమోదు కాగా వీటిల్లో సైబర్ పోలీసులు దృష్టికి రానివి మరో 500 వరకు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది 486 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో పోలీసుల దృష్టికి రానివి దాదాపు 1002 ఉండొచ్చని అంచనా. ఈ ఏడాది నమోదైన 486 కేసుల ద్వారా రూ 12.89 కోట్లు పోగొట్టుకున్నట్లు సమాచారం. అధికారిక సమాచారం ప్రకారం రూ.2.36 కోట్లు రికవరీ చేసి బాధితుల ఖాతాల్లోకి జమ చేశారు.



ముగ్గురు చిన్నారుల జలసమాధి

ఫిబ్రవరి 5న.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ ఊటువంకలో సోదరులు పునీత్ (11), కన్నయ్య (9).. వీరి స్నేహితుడు తేజేశ్వర్ (9) బడి నుంచి ఇంటికొచ్చారు. గ్రామ సమీపంలోని పచ్చిపాల ఓబన్న చెరువు వద్ద ఆడుకుంటూ తేజేశ్వర్ చెరువులో పడిపోయాడు. అతడిని రక్షించే ప్రయత్నంలో పునీత్, కన్నయ్య నీటిలో మునిగిపోయి మృతిచెందారు.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ముగిసిన తిరుపతి బాలోత్సవం

● రెండు రోజుల్లో 8,500 మంది హాజరు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూ మున్సిపల్ వేదికగా రెండు రోజులపాటు జరిగిన 'తిరుపతి బాలోత్సవం' ఆదివారం ముగిసింది. 163 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ళకు చెందిన 8,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి 30 అంశాల్లో, 70 విభాగాలుగా, 6 సమాంతర వేదికలపై పోటీలు నిర్వహించారు. 3, 4, 5 తరగతి విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10వ తరగతి విద్యార్థులను సీనియర్లుగా విభజించి పోటీలు పెట్టారు. చిత్రలేఖనం, బొమ్మకు కథ రాయడం, వ్యాస రచన, ఉక్త లేఖనం, లేఖా రచన, దేశ, ప్రపంచ పటాలను రూపొందించడం, జ్ఞాపకశక్తికి పరీక్ష, చెత్తతో కళాకృతి తయారు, ఏకపాత్రాభినయం, క్లాసికల్, సోలో డ్యాన్స్, క్లాసికల్, సోలో సాంగ్, గ్రూప్ సాంగ్, జానపద పాటలు, దేశభక్తి పాటలు, పౌరాణిక నాటికలు, సంగీత వాయిద్యాల ప్రదర్శన, సంప్రదాయ వస్త్రధారణ, చదరంగం, పదకేళి తెలుగులో మాట్లాడటం, వక్తృత్వం, పద్యం-భావం, కథ చెబుతాను-ఊకొడతావా?, గణితం-తర్కం, మట్టితో బొమ్మల తయారీ, కోలాటం, యోగా, శాస్త్రీయ సంగీతం తదితర పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో విజేతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు.



హ్యాపీగా న్యూ ఇయర్ జరుపుకోండి

● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
● అనుమతిలేని ఈవెంట్లు నిర్వహిస్తే కేసులు
● ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టీకరణ



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన ఆంగ్ల సంవత్సరాదిని సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. ఈ క్రమంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చర్యలు తప్పవని ఆదివారం హెచ్చరించారు. డిసెంబరు 31న రాత్రి పది గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రోడ్లలో చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడతామన్నారు. మద్యం దుకాణాలు, బార్లను నిర్దేశించిన సమయంలో మూసివేయాలన్నారు. తిరుపతిలోని గరుడ వారధి, యూనివర్శిటీ ఫ్లై ఓవర్‌లను డిసెంబరు 31న రాత్రి 10 గంటలకు మూసివేస్తామన్నారు. రోడ్లు, ఫ్లై ఓవర్లపై నూతన సంవత్సర వేడుకలు నిషిద్ధమని చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడితే రిమాండ్‌కు పంపిస్తామని చెప్పారు. అశ్లీల నృత్యాలు, డీజే సౌండ్లు, రికార్డింగ్ డ్యాన్సుల నిర్వహణకు అనుమతుల్లేవన్నారు. బైకులు, కార్ల రేసింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు స్థలాల్లో ఈవెంట్ల నిర్వహణకు అనుమతి తప్పనిసరన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విదేశీయులు ఎవరైనా ఈవెంట్లకు హాజరైతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పెచ్చులూడుతున్నాయ్ జాగ్రత్త

● సీబీఎస్ అధికారులకు ఆర్టీసీ ఈడీ ఆదేశం

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీహరి బస్టాండు భవనం శిథిలావస్థకు చేరుకుందని, రక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సెంట్రల్ బస్సు స్టేషన్‌లో పర్యటించారు. శ్రీహరి బస్టాండులో ప్రమాదం పొంచి ఉన్న స్థలాలను ఎంపిక చేసి, బ్లాక్ చేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ బస్టాండు గురించి అధికారులతో చర్చించారు. డీపీటీవో జగదీష్, బస్టాండు ఏటీఎం డీఆర్ నాయుడు, డీఈ చెన్నకేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

3న శ్రీకాళహస్తిలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్

తిరుపతి(విద్య), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో జనవరి 3న జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్(ఎగ్జిబిషన్) నిర్వహిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌సీఈఆర్‌టీ, జిల్లావిద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 30న పాఠశాల స్థాయిలో, 31న మండల స్థాయిలో పోటీలు నిర్వహించి ఎంపికైన ప్రాజెక్టులను జిల్లాస్థాయి పోటీలకు పంపాలని సూచించారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, ఎర్త్/స్పేస్‌సైన్స్ పర్యావరణం, ఇంజినీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్‌లకు సంబంధించిన ఉప అంశాలలో ప్రాజెక్టులను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యక్తిగత, గ్రూప్, టీచర్ల వారీగా ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. శాస్త్రీయ దృక్పథం, సామాజిక ప్రయోజనకారిగా ఉన్న ప్రాజెక్టులను రూపొందించాలని పేర్కొన్నారు. థర్మకోల్‌తో తయారు చేసిన ప్రాజెక్టులు అనుమతించబడవని, అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో సైన్స్‌ఫేర్‌లో పాల్గొనాలని సూచించారు.

షార్ @ 99

నేటి ప్రయోగానికి పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ సిద్ధం

షార్ నుంచి 99వ ప్రయోగం. పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఇది 62వది. సోమవారం రాత్రి 9.58 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్‌కు చెందిన 440 కిలోల బరువు గల స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. ఇప్పటికే షార్‌లో పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసి మొదటి ప్రయోగ వేదిక వద్దకు తరలించారు. స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను అనుసంధానించి అంతరిక్షయానానికి రాకెట్‌ను సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. కౌంట్‌డౌన్ జరిగే సమయంలో రాకెట్‌లోని రెండు, నాలుగు దశల్లో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఆదివారం షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లో నిమగ్నమయ్యారు. ప్రయోగ నేపథ్యంలో శ్రీహరికోట రాకెట్ కేంద్రం సందడిగా మారింది. మరోవైపు షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. షార్ చుట్టుపక్కలతో పాటు సముద్ర మర్గాన కూడా జల్లెడపట్టి గాలిస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



హీట్‌షీల్డ్‌లో అమర్చిన స్పాడెక్స్ ఉపగ్రహాలు





ప్రయోగ వేదికపై ఎగరడానికి సిద్ధంగా.. - పీఐఎఫ్ భవనం నుంచి ప్రయోగ వేదికకు తరలుతున్న పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్

మరోసారి పక్షుల పండుగ తేదీల మార్పు!

తడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ తేదీలు మరోసారి మారే సూచనలు కనబడుతున్నాయి. నాలుగేళ్ల తర్వాత సూళ్లూరుపేట కేంద్రంగా పక్షుల పండుగ నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆ మేరకు ప్రభుత్వం నుంచి మౌళిక ఆదేశాలు జిల్లా అధికార యంత్రాంగంకు అందాయి. మొదట పక్షుల పండుగను జనవరి 10, 11, 12 తేదీలలో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. సమయం తక్కువగా ఉండటంతో ఆ తేదీలను జనవరి 17, 18, 19 తేదీలకు మార్చారు. ఆమేరకు అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ, నాయుడుపేటలో మూడు రోజులపాటు ఏటి పండుగ అవే రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆ తేదీలను మార్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌కు తేదీల మార్పును సూచించినట్లుగా తెలుస్తుంది. పండగ తేదీలలో పాఠశాలలకు సెలవుదినాలు కావడంతో ఊర్లకు వెళ్లిన విద్యార్థులు పక్షుల పండుగను వీక్షించే అవకాశం ఉండదు. ఈ క్రమంలో తేదీల మార్పును ప్రతిపాదించామని, అందరికీ అనుకూలమైన తేదీలలోనే పక్షుల పండుగ నిర్వహిస్తామని ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ మీడియాకు తెలిపారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వారాంతం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 29వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2.784మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,638మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,831మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,041, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 296మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 282మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 102మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 22,116 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



పండుతున్న పాపాలు

- జగనన్న లేఅవుట్లలో స్థలం చదును పేరిట భారీగా నిధుల స్వాహా
- ఇప్పటికే రూ.60 కోట్లు చెల్లింపు
- ఇంకా రూ.33 కోట్లు పెండింగ్
- నేటి నుంచి విచారణ
- నాలుగు బృందాల ఏర్పాటు



కలువాయి మండలం మాదన్నగారిపల్లెలో వేసిన లేఅవుట్

నెల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అందు కలదు.. ఇందులేదన్న.. సందేహము వలదు.. ఎందెందు చూసినా అందందే కనిపించెను అవినీతి.. అన్నట్లుగా తయారయ్యాయి గత ప్రభుత్వంలోని పరిస్థితులు. ఏ పథకంపై విచారణ జరిపినా అందులోని అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఆఖరుకి పేదల ఇళ్ల మాటున నాడు జరిగిన దోపిడీకి అంతూపొంతూ లేదు. లేఅవుట్లకు స్థలాల కొనుగోలు దగ్గర నుంచి వాటిని చదును చేసే వరకూ రూ.వందల కోట్ల ప్రజాధనం స్వాహా జరిగినట్లు మొదటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క లేఅవుట్ల చదును మాటునే ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.50 కోట్లకు పైగా స్వాహా జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికి చెల్లించిందే ఎక్కువనుకుంటుంటే ఇంకా బిల్లులు చెల్లించాలంటూ కొందరు కోర్టును ఆశ్రయిస్తుండడంపై ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించింది. డ్వామా ద్వారా బిల్లుల చెల్లింపు జరిగిన అన్ని లేఅవుట్లను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించేందుకు కలెక్టర్ ఆనంద్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. ఈ విచారణ పూర్తయితే అక్రమాల బాగోతం వెలుగులోకి రానుంది. దీంతో ఇప్పటికే అక్రమార్కుల్లో వణుకు పుడుతోంది.

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతి గ్రామంలోనూ భూమిని సేకరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో సుమారు రెండు వేల లేఅవుట్లను వేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భూమిని చదును చేశారు. డ్వామా నుంచి 1170 లేఅవుట్లకు రూ.59.85 కోట్లను బిల్లులు కింద ఇప్పటికే చెల్లించారు. ఎంబుక్‌ల ప్రకారం ఇంకా రూ.33 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని వైసీపీ నేతలు కోర్టును ఆశ్రయిస్తున్నారు.

భారీ దోపిడీ

లేఅవుట్ల చదునుకుగానూ క్యూబిక్ మీటర్ గ్రావెల్‌కు రూ.135 చెల్లించేలా నిర్ణయించారు. అప్రూవల్ క్వారీ నుంచి తీసుకువచ్చిన గ్రావెల్‌కే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా తహసీల్దార్ల అనుమతితో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్‌ను తీసుకెళితే రూ.50 తగ్గించి క్యూబిక్ మీటర్‌కు రూ.85 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో మెజారిటీ లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే గ్రావెల్‌ను తరలించారు. కానీ బిల్లుల దగ్గరికి వచ్చే సరికి రూ.135 చొప్పున చెల్లించారు. అలానే విత్‌హెల్డ్ మొత్తం 25 శాతం ఉంచాలని ప్రభుత్వం ఆదేశిస్తే చాలామందికి 10 శాతం మాత్రమే ఉంచి మిగిలిన 15 శాతం చెల్లించేశారు. ఇలా ఇప్పటికి సుమారు రూ.60 కోట్ల వరకూ బిల్లులు చెల్లించారు. అయితే కొన్నిచోట్ల అవసరం లేకపోయినా తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్నారు. కొన్నిచోట్ల చేసిన పనికి, రికార్డుల్లో నమోదైన వివరాలకు వ్యత్యాసం ఉంటోంది. ఇటువంటి అవకతవకలు గతంలోనే వెలుగులోకి వచ్చినా నాడు పట్టించుకోలేదు. క్షేత్రస్థాయి విచారణ జరిపితే ఇప్పటికి చెల్లించిన మొత్తమే చాలా ఎక్కువగా ఉంటుందని డ్వామా వర్గాలు చెబుతున్నాయి.

నాలుగు బృందాలతో విచారణ

లేఅవుట్ల చదును పేరుతో జరిగిన అవినీతిని బయటకు తీసేందుకు ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, అందుకు జిల్లాలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌తో పాటు ఈసీలు, టీఏలు ఈ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. లేఅవుట్లను గ్రావెల్‌తో చదును చేశారా..? ఈ గ్రావెల్‌ను అప్రూవల్ క్వారీ నుంచి తీసుకొచ్చారా.. లేక ప్రభుత్వ భూముల నుంచా..? ఎంబుక్‌లో రికార్డు మేరకు పని జరిగిందా..? బిల్లులు చెల్లింపు నిబంధనల ప్రకారం జరిగిందా.. లేదా..? విత్‌హెల్డ్ మొత్తం ఎంత ఉంచారు..? ఎంత చెల్లించేశారు..? అన్నది విచారణలో పరిశీలిస్తారు.

నేటి నుంచి విచారణ

పేదలందరికీ ఇళ్లు పథకంలో జరిగిన లేఅవుట్ల చదునుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాలో క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ సిబ్బందితో నాలుగు విచారణ బృందాలను ఏర్పాటు చేశాం. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ చేపడతాయి. విచారణ పూర్తయ్యాక ఆ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తాం.

- గంగాభవాని, డ్వామా పీడీ





నాగూరయ్య(ఫైల్‌ఫొటో) - స్వర్ణముఖిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

స్వర్ణముఖినదిలో పశువుల కాపరి గల్లంతు

కోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోట మండలం రుద్రవరం స్వర్ణముఖినదిలో ఆదివారం యల్లశిరి నాగూరయ్య (47) అనే పశువుల కాపరి గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు... రుద్రవరం అరుంధతీయవాడకు చెందిన నాగూరయ్య తన గేదెలను మేతకోసం సమీపంలోని స్వర్ణముఖినది వద్దకు తోలుకెళ్లాడు. నదిలో నీళ్లు తాగడానికి వెళ్లిన గేదెలు ఎంతకి బయటకు రాకపోవడంతో నాగూరయ్య నదిలోకి దిగాడు. గేదెలను బయటకు తోలుతుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. గమనించిన సహచర పశువుల కాపరులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు వచ్చి నదిలో గాలించినా నాగూరయ్య ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో టీడీపీ నాయకుడు కృష్ణయ్య కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పొద్దుపోయేవరకు నదిలో గాలించినప్పటికీ నాగూరయ్య ఆచూకీ దొరకలేదు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమణకుమార్, పక్కన సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్

గూడూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రల పరిరక్షణలో భాగంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి పోలీస్‌శాఖ ఆంక్షలు అమలు పరచడం జరుగుతుందన్నారు. రాత్రిపూట ప్రజలు గుంపులుగా తిరగడం, పెద్దగా శబ్దాలు చేస్తూ మోటారు సైకిళ్లు నడపడం, రోడ్ల మీద కేక్‌లు కట్ చేయడం వంటి కార్యక్రమాలను నిషేధించామని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలంటే తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేలు, అసభ్యకరమైన నృత్యాలకు అనుమతి లేదన్నారు. ప్రధాన కూడళ్లలో పోలీస్ గస్తీని ముమ్మరం చేస్తామని, సాధారణ ప్రజా జీవనానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సరం సందర్భంగా వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్ సందర్శనను నిషేధించినట్లు తెలిపారు. ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆయన మాట్లాడుతూ 31వ తేదీపట్టణంలో ట్రాఫిక్ రూల్స్‌ని పటిష్టం చేస్తున్నామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సుబ్బారావు, భవని, ఏఎస్‌ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య

పెళ్లకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతోనే నేడు ట్రూఅప్ చార్జీలు వసూలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో చంద్రబాబునాయుడు మిగులు విద్యుత్‌తో జగన్‌కు అప్పజెప్పారన్నారు. గత వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు అడ్డుగోలుగా పెంచి ఇప్పుడు ధర్నాలు పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాడుపూరు మురళీ నాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరామయ్య, నరేంద్ర యాదవ్, వేణురెడ్డి, పరుశురామ్, రవి, చంద్ర, రమణయ్య పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

గూడూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాయలంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టడంతో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే నేటికీ హామీలను అమలు చేయలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా చెంగయ్య, ఉపాధ్యక్షుడిగా రామయ్య, కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శులుగా పెంచలప్రసాద్, పెంచలయ్య, కోశాధికారిగా పళణితో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య, పద్మనాభయ్య, జోగి శివకుమార్, కోటేశ్వరరావు, టీవీరమణయ్య, సురేష్, మణి, ప్రసాద్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ

కోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఎన్‌సీసీ 10ఏ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు కళాశాలలకు చెందిన 406 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ సమైఖ్యతపై క్యాంప్ కమాండెంట్ గణేష్ గొడంగవే శిక్షణ ఇచ్చారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి మాధవయ్య, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి చేతులమీదుగా షీల్డ్‌లు, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన

వెంకటగిరి టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక టీచర్స్ కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు చింతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భగవద్గీతపై అవగాహన కల్పించారు. వెంకటరత్నమ్మ, వెంకటలక్ష్మి, అమరావతి పాల్గొన్నారు.

వైసీపీ ధర్నా చేయడం హాస్యాస్పదం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నేతలు సుధాకర రెడ్డి, రమేష్, మాధవ నాయుడు, సంచి కృష్ణయ్య, శ్రీనివాసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందంటూ వైసీపీ ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 2014లో చంద్రబాబు నాయుడు సీఎం అయినప్పుడు 22.5 మిలియన్ల యూనిట్ల లోటు ఉండగా 2019లో మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉందన్నారు. జగన్‌లో చేతగాని పాలనతో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. విద్యుత్ కొరతను సృష్టించి బహిరంగ మార్కెట్లలో అధిక రేట్లకు కొనుగోలు చేసి రూ.2700 కోట్లు నష్టం వచ్చేలా చేసిన పాపం జగన్‌దేనని, ఈ విషయం వైసీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. సెకీ ఒప్పందం వల్ల ఏడాదికి రూ.3850 కోట్ల చొప్పున 30 సంవత్సరాల పైబడి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెంచిదంటూ ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కుదేలైన విద్యుత్ రంగాన్ని మళ్లీ పుంజుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకరరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మాధవ నాయుడు, నాయకులు అలవల శ్రీనివాసులు, బొమ్మన్ పళణి, కొలవి శెల్వం, సంచి కృష్ణయ్య, టీకే శ్రీనివాసన్, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దళితులపై దాడి కేసు విచారణ



మన్నూరులో బాధితులను విచారిస్తున్న డీఎస్పీ రమణకుమార్

బాలాయపల్లి, డిసెంబరు 29,(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నూరు గ్రామంలో భూ వివాదమై దళితులపై జరిగిన దాడి కేసును గూడూరు డీఎస్పీ రమణకుమార్ ఆదివారం విచారించారు. బాధితులు మాట్లాడుతూ స్థానిక బీసీ కాలనీకి చెందిన జడపల్లి సురేష్, జడపల్లి బాబు, జడపల్లి శ్రీనివాసులు మరికొందరితో కలిసి తమపై దాడి చేసి గాయపరిస్తే పోలీసులు తమ ఫిర్యాదును పరిగణలోకి తీసుకోలేదన్నారు. పైగా తమపైనే కేసులు పెట్టారని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపి, ఏఎస్‌ఐ మాల్యాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

వెంకటగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగయ్య జూనియర్ కళాశాలలో పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ నాగేశ్వరరావు, పద్మశాలి సంఘ నాయకులు వేణు, సూరిబాబు, రవికుమార్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్యామ్, రమణయ్య, బాలాజీ, మునికోటి, రాజేంద్ర కుమార్, గొట్టిముక్కల రామచంద్రయ్య పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

నాయుడుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు పార్టీ భరోసా లభిస్తుందని నాయుడుపేట మాజీ సర్పంచు గూడూరు ప్రభావతి అన్నారు. ఆదివారం నాయుడుపేటలో టీడీపీ సభ్యత్వ చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, తిరుమలరావు, కిషోర్, సుబ్బారారెడ్డి, రఫీ, సాయిహేమంత్, నవీన్ పాల్గొన్నారు.

మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న ఏపీపీ ప్రకృతి కుమార్, గోపీనాథ్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో స్వామి వివేకానందా యువసైన్యం ఆధర్యంలో ఏపీపీ ప్రకృతికుమార్ ఆదివారం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీనస్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత కోవి వెంకన్నబాబు, యువసైన్యం సభ్యులు ఫణీంద్ర, గోపీనాథ్, శ్యాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చిల్లకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడకు చెందిన శంకరమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మస్తానయ్య, సుధాకర్, సాయివెంకటకృష్ణ, ఆనందయ్య పాల్గొన్నారు.

108 ఉద్యోగులకు జీతం పెంపు హర్షణీయం

నాయుడుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 108 వ్యవస్థలో పనిచేస్తున్న ఈఎంటీ, పైలెట్ ఉద్యోగులకు జీతం రూ.4వేలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్ ఆదివారం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శనివారం జరిగిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, అధికారుల సమీక్షా సమావేశంలో 108 వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతం పెంపుదలకు తీసుకున్నట్లు తెలిపారు. 2014లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు 108 ఉద్యోగుల కష్టాలను గుర్తించి జీవో నెంబరు ఎంఎస్ 49 ద్వారా నెలకు రూ4వేలు వేతనాలను పెంచారని గుర్తు చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం 108 కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.4వేల జీతం పెంపుదల నిర్ణయం సంతోషకరమన్నారు.

పేదలకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ



పేదలకు దుస్తులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదనగర్ సమీపంలోని గిరిజన కాలనీలో ఆదివారం పీపుల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మల్లికార్జున్, కొండా రామచంద్రారెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, మధు, సురేష్‌బాబు, బాలరమణయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నెల్లటూరు సమీపంలోని గిరిజనకాలనీ వద్ద కృపాసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గోపీనాథ్

నాయుడుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహేర్ ఆశ్రమంలోని వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు, మానసిక వికలాంగులకు డాక్టర్ గోపీనాథ్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

దుప్పట్లు.. దోమతెరల పంపిణీ

కోట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల వావిళ్లదొరువు, యమదిన్నెపాళెం, గున్నంపడియా గ్రామాల్లోని 100 మంది పేదలకు షిరిడీ సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ రావూరి చంద్రాచారి దాతృత్వంతో ఆదివారం దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, టీడీపీ నాయకులు వాటంబేటి చెంగల్‌రావు, వెంకటయ్యగౌడ్, మస్తానయ్య గౌడ్, ఆవుల సుబ్బయ్య, తదతరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేస్తే... బ్యాంకు ఖాతాలో రూ.లక్ష మాయం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేస్తే బ్యాంకు ఆమె ఖాతాలో నుంచి రూ.లక్ష మాయమైంది. దొరవారిసత్రం మండలానికి చెందిన ఓ మహిళ నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహిస్తోంది. గత గురువారం ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేయగా బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితురాలు బ్యాంక్‌కు వెళ్లి తన ఖాతా వివరాలను తెలుసుకోగా రూ.లక్ష డ్రా అయినట్లు తెలిసింది. దీంతో తిరుపతిలోని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో విందు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణలో విందు చేసుకొంటున్న నాయకులు, అధికారులు

సూళ్లూరుపేట, డిసెంబరు 29: సూళ్లూరుపేటలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) కార్యాలయంలో విందు నిర్వహించడం విమర్శలు వెల్లువెత్తాయి. పట్టణం నడిబొడ్డులో తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు నున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆదివారం ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు, పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో విందు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి యూటీఎఫ్



ప్రచారజాతలో యూటీఎఫ్ నాయకులు

నాయుడుపేట టౌన్, వెంకటగిరిటౌన్, డిసెంబరు 29,(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి యూటీఎఫ్ అని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం కోరుతూ తిరుపతి నుంచి కాకినాడకు వెళ్తున్న యూటీఎఫ్ ప్రచారజాత ఆదివారం సాయంత్రం నాయుడుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50వసంతాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్, ముత్యాల్‌రెడ్డి, రామచంద్రాయ్య, నిర్మల, ఆదినారాయణ, గోవర్ధన్‌రెడ్డి, సునీల, నాగరాజు, శివప్రసాద్, సుబ్బారావు, శంకరయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కుమారస్వామి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, మండల ప్రధాన కార్యదర్శి సోమశేఖర రావు, ఎం.వెంకటేశ్వర్లు, సరస్వతి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ర్యాలీలో విద్యార్థులు ఎక్సైజ్ అధికారులు, గురుకుల ప్రిన్సిపాల్, సిబ్బంది

ఓజిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం చిల్లమానుచేను గురుకుల పాఠశాలలో ఆదివారం గూడూరు, నాయుడుపేట ఎక్సైజ్ సీఐలు బాకృష్ణ, అరుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ జ్యోతిరావు, అధ్యాపకులు, ఎక్సైజ్ అధికారులు ర్యాలీ నిర్వహించారు.

ఉపాధ్యాయురాలికి ఉత్తమ మోటివేషన్ అవార్డు

సూళ్లూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటకు చెందిన ఉపాధ్యాయురాలు డాక్టర్ కొప్పోలు అరుణకుమారికి ఉత్తమ మోటివేషన్ అవార్డు లభించింది. హైదరాబాదుకు చెందిన ఇంప్యాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థలో వారం రోజుల పాటు వ్యక్తుల నైపుణ్యానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అరుణకుమారి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంప్యాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు, అధ్యక్షుడు శ్రీనివాస్ సోను చేతుల మీదుగా ఉత్తమ మోటివేషన్ అవార్డు అందుకున్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు అరుణకుమారి